

# "మరివికాసం?!..."

-భాస్కర స్వర్ణాంబ

"ఏయ్, రమా! బాగున్నావా?" ఆత్మీయతతో కూడిన పిలుపు, పలకరింపు, అందునా స్వచ్ఛమైన తెలుగు మాట వినిపించే సరికి చాలా ఆశ్చర్యంవేసింది. బెంగళూరు మహానగరంలో నన్ను తెలుగులో పలకరించే వారెవరా? అనుకుంటూ వెనక్కి తిరిగి చూశాను. వెంటనే పోల్చుకో లేకపోయినా, ఆ మరుక్షణంలోనే ఆమెవరో తెలిసిపోయింది.

"ఏయ్, మొద్దూ... ఇంకా నేనెవరో పోల్చుకో లేదూ?" మళ్లీ దబాయింపు.

"ఏమిటీ! లతా!.... ఇప్పుడు? ఇక్కడ?..." నాలో ఆశ్చర్యం.... "అమ్మయ్య..... గుర్తున్నానుకదా? ముందు నువ్వవునో కాదో అని సందేహ మొచ్చింది. కానీ, ఆ నడక చూడగానే గుర్తు పట్టేశాను. ఇలా నాట్య మయూరిలా నడిచే అమ్మాయి ఎవరుంటుంది? మా రమ తప్ప అనుకున్నాను - అందుకే ఇక ఆగలేక గట్టిగా అరిచాను -" అంది లత.

"అబ్బా... ఇంకా, నా నడకలో నాట్యాలున్నాయా? మారిపోలేదూ?..... నీవు మాత్రం చాలా మారిపోయావ్. లత కాస్తా మానయిపోయావే -" అన్నాను నవ్వుతూ.

'అమ్మయ్య...నవ్వావుకదా? ఇందాకట్నించి చూస్తున్నాను. సర్వంకోల్పోయిన దానిలా ఆ దిగులు మొహ మెందుకు? ఇంతకీ మీ ఇల్లెక్కడా? ఇక్కడి కొచ్చి ఎన్నాళ్లయింది?... నన్ను మీ ఇంటికి రమ్మంటావా లేదా? చెప్పు....." అంది లత. ఏం మారలేదు మాటల్లో..... అదే దబాయింపు సెక్షన్.

అప్పటికే జయనగర్ కాంప్లెక్సులో సాయం సందడి మొదలైంది. ఏమాట కామాట చెప్పుకోవాలి. బెంగళూరులో షాపింగ్ చేయడానికి వచ్చినా సాయంత్రాలు చల్లగా, ఆహ్లాదకరంగా వుంటాయి. ఇక్కడ వీళ్లు జీవితాన్ని బాగా అనుభవిస్తారు. ఆ కాంప్లెక్సు ఆవరణలో జంటలు జంటలుగా, పిల్లలతో కూర్చుని ఏవేవో తింటూ, కబుర్లు చెప్పుకుంటున్నారందరూ. నేను ఆ దృశ్యాలను చూస్తూ పరాకుగా వుండడం గమనించిందేమో, - "నీ షాపింగ్ అయిపోయినట్లుంది. పద, అలా, చల్లగాలిలో కూర్చుందాం"- అంటూ ముందుకు దారి తీసింది లత.

నేనూ, తనూ, ఇద్దరం, ఒక చెట్టు క్రింద కూర్చున్నాం.

లతా, నేనూ, చిన్నప్పటినుండి కలిసి చదివాం. ఇంటర్ తర్వాత తను పై చదువులు చదవడానికి వెళ్లింది. మా ఊళ్లో పై చదువులకు అవకాశం లేక పోవడం వల్లా, పరాయి వూళ్లకు పంపి, హాస్టల్లో వుంచి చదివించే శక్తి మా నాన్నకు లేక పోవడం వల్లా, నేను అంతటితోనే చదువుకు ఫుల్ స్టాప్ పెట్టేశాను. తర్వాత కొన్నేళ్లకు నా పెళ్లి కుదిరింది. అంత వరకూ లతతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూండేవి. ఆ తర్వాత, తన గురించి, నాకు తెలీ లేదు. ఆ విషయమే లత నడిగాను. "లతా, ఇప్పుడెక్కడున్నావ్? ఏం చేస్తున్నావ్?" అంటూ. "నా ఎమ్మెస్సీ అయిపోయాక, ఫారిన్ వెళ్లి పి.హెచ్.డి. చేశాను. తర్వాత ఢిల్లీలో ఉద్యోగం, ప్రస్తుతం అక్కడే ఉంటున్నాను. ఇక్కడ మూడు రోజులు కాన్ఫరెన్స్ వుండడం వల్ల వచ్చాను. అనుకోకుండా నిన్ను చూడ్డం ఎంత ఆనందంగా వుందో చెప్పలేను" అని, చిన్నప్పటి విషయాలన్నీ గుర్తు చేసుకుంది.

'అప్పటి బంగారు రోజులు మళ్లీ రావు కదా?' అని నిట్టూర్చాను.

"ఏం,? అలా అంటున్నావ్? ఇప్పుడు నీకేమైంది?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది లత.

"లతా! కొన్ని జీవితాల్ని గూర్చి ప్రశ్నలు వేయక పోవడం మంచిది -" అన్నాను.

'ఏమిటే అది? ఇందాకటి నుండి చూస్తున్నాను. ఒకటే ఇదై పోతున్నావ్?- అంటూ గద్దించింది లత. లతకున్నంత ధైర్యం నాకుంటే నా జీవితం ఇలా ఎందుకుంటుంది? అనుకుంటూ, "నా కథ ఆత్మీయురాలైన నీకు కాక మరెవరికి చెబుతాను? నా దిగులు ఇలాగైనా తగ్గుతుందేమో!..... విను లతా.... పెళ్లిలోనే మా అత్తగారింటి వాళ్లు కట్నం, లాంఛనాల, విషయంలో పేచీ పెట్టారు. మా నాన్న శక్తికి మించి ఖర్చు పెట్టినా వాళ్లను సంతోష పెట్ట లేక పోయారు."

"అబ్బా... మామూలు కథే నన్నమాట! ఇంతకీ మీ వారు ఇప్పుడేం ఉద్యోగం చేస్తున్నారు? పిల్ల లెంత మంది?-" అర్థోచ్చి ప్రశ్నించింది లత.

"ఆయన మా ఊళ్లోనే వుంటారు. ప్రస్తుతం, నేను బాకీ వున్న కట్నం డబ్బు తీర్చేస్తే, వాళ్లింటికి వెళ్లొచ్చు. లేదూ, ఇక్కడే మా అన్నయ్య ఇంట్లో పడివుండాలి. నాన్నా లేరుగా?...." నా గొంతులోని దుఃఖాన్ని కనిపెట్టింది లత 'ఏమిటీ అది! మీ అన్నా వాళ్లింట్లో వుంటున్నావా?-" ఆశ్చర్య పోతూ అడిగింది.

"అవును లతా, కట్నం తాలూకు డబ్బు పోగు చేస్తున్నాను. ప్రస్తుతం ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ వచ్చిన డబ్బంతా కూడ బెట్టున్నాను. ఇంకా చిన్న చిన్న పనులు చేసి డబ్బు సంపాదిస్తున్నాను-"

"స్టాపిట్!-" గట్టిగా అరిచింది లత.

'ఏమిటే అది? అంత బానిస బతుకెందుకు? డబ్బిస్తేనే నీవు రావాలి అన్నప్పుడు, నీకు మాత్రం పౌరుషం లేదా? అతనితో తెగ తెంపులు చేసుకో. మనిషి కంటే డబ్బు ముఖ్యమనుకునే వాళ్లతో సంబంధ మెందుకిక?' లత కోపం చూసి నవ్వొచ్చింది నాకు.

"ఏం చేయమంటావ్? సమాజం ముందుకు పోయిందనీ ఆడవాళ్లకు స్వాతంత్ర్యం వచ్చిందనీ, కథల్లో, నవలల్లో రాస్తారు. సినిమాలు తీస్తారు. కానీ వాస్తవానికి ఆడదాని బతుకు ఏం మారలేదు. నేను మా అన్న గారింట్లో వుంటున్నాను?. మా వదిన మంచిదే కానీ, వాళ్లకూ, పిల్లలూ, సంసారం ఉందిగా. వచ్చే ఆదాయం చాలదు. ఇల్లు చిన్నది. పోనీ నేను వేరే ఇల్లు తీసుకుందామంటే ఎక్కడ సాధ్యమౌతుంది? నీకు తెలీదు లతా! ఒంటరి ఆడదానికి ఎన్నో సమస్యలు. అందుకే మా అన్న వదినా చెప్పినట్లు విని, డబ్బు ఎలాగో సంపాదించేంత వరకూ, వాళ్లింట్లో తలదాచుకోవడం మంచిదన్న

నిర్ణయంతో వున్నాను.''

"చాల్లే - ఇక్ష్వాకుల కాలం నాటి మాటలు మాట్లాడకు. ఒంటరిగా ఉంటే సమస్యా? నేను లేనూ ఒంటరిగా?'' లత, నా మాటలు కొట్టి పారేస్తూ అంది.

"నీ స్థితి వేరు. నీవు పెద్ద ఆఫీసర్‌వి. నౌకర్లు, చాకర్లు, పలుకుబడి. అవదలేవీ నిన్ను చుట్టుముట్టవు. కానీ నా లాంటి మధ్య తరగతి స్త్రీ బ్రతుకింతే-'' నిరాశగా అన్నాను.

"సర్లే - వూర్కే అమ్మమ్మ కబుర్లు చెప్పకు. మీ అన్నయ్యను చూసి, నీ సంగతి మాట్లాడతాను'' అంది లత రిక్షాను పిలుస్తూ.

"రిక్షా ఎందుకే. ఇక్కడికి దగ్గరే. నడిచి వెళ్దాం' అన్నాను నేను. రిక్షాకు ఐదు రూపాయలవుతుంది మరి. ఆ అయిదు రూపాయలూ వృధా చేయడం నాకు ఇష్టం లేదు. లత చేత ఇప్పించడం బాగుండదు..... ఆటో రిక్షా వచ్చి మా దగ్గర ఆగింది. నన్ను రిక్షాలోకి నెట్టి, తనూ కూర్చుంది లత. నేను మా ఇంటి ఎడ్రెస్ చెప్పాను. ఆటో కదిలింది.

"అది కాదు రమా! నీవు మరీ ఇంత మొద్దు వయిపోయావేం? నా మాట విను, నాతో వచ్చేయి. నీకక్కడే ఏదైనా ఉద్యోగం చూస్తాను. అలాగే డిగ్రీ కూడా పూర్తి చేయొచ్చు.

"ఆ డబ్బు మనుషులను పట్టుకుని వేళ్లాడట మెందుకు?'' బ్రతిమాలుతున్న ధోరణిలో అంది లత.

"నీకు, నా మీదు న్న అభిమానం కొద్దీ అలా అంటున్నావ్. కానీ, నేను సగటు ఆడదాన్ని. నా భర్త నా ఇల్లు, పిల్లలు, అంటూ, చిన్నలోకం వుంటే చాలనుకునే దాన్ని. నాకే ఆశలూ లేవు లతా!'' అన్నాను కన్నీళ్లు తుడుచుకుంటూ, ఆటో రిక్షా ఆగింది.

"ఇక్కడ కాదు. ఇంకా ముందుకు పోనీ-'' అన్నాను కన్నడంలో. ఆటో కదిలింది.

లత మళ్లీ మొద లు పెట్టింది. నీకేం భయం లేదు రమా! నీ జీవితం సవ్యంగా నడిచేలా నేను చూస్తాను. అసలు, కట్నం అడిగిన వాణ్ణి నువ్వెందుకు ఒప్పుకున్నావ్? ఇప్పుడు ఆ డబ్బు సంపాదించి ఇచ్చి అతనితో జీవితం సాగిస్తానంటావ్? నీకు అసలు బుద్ధుందా?'' అంటూ లత రకరకాలుగా నాతో వాదించడం మొదలు పెట్టింది, భయపెట్టింది. కానీ, నేను అన్నీ వింటూ మౌనంగా కూర్చున్నాను. ఆటో మళ్లీ ఆగింది. నాకెందుకో అనుమాన మొచ్చింది. ఆటో డ్రైవర్ మా సంభాషణ వింటున్నాడా? అని. కానీ అతనికి తెలుగెక్కడ అర్థమౌతుందిలే అనుకున్నాను. ట్రాఫిక్ సిగ్నలుంది అక్కడ. అందుకాగి నట్టున్నాడు.

"అసలు నీ సమస్య ఏమిటి చెప్పు? అక్కడ నీకేం సుఖం? వాళ్లు ఇంకా డబ్బు తెమ్మని ఇలా పీడిస్తూనే వుంటారు. అప్పుడేం చేస్తావ్?-'' లత నిలదీసింది.

ఇక నేను ఆపుకోలేక పోయాను. "అక్కడ.... వాళ్ల దగ్గర... నా మూడేళ్ల కొడుకున్నాడు లతా.'' అంటూ భోరున ఏడ్చాను. ఆటో అతను భయపడినట్లు ఠకీమని మళ్లీ ఆటో ఆపాడు. లతకూడా ఈమాట విని నిశ్చేష్టురాలైంది.

'నా కన్న బిడ్డను నా దగ్గరుంచితే వాళ్లకు పూర్తిగా డబ్బు ఇవ్వమని, వాణ్ణి వాళ్లే వుంచుకున్నారు. అలాగయినా మేము డబ్బు ఇస్తామట లతా! వాణ్ణి వదలి ఎలా వుంటున్నానో నా కర్థం కావటం లేదు. నా లాంటి జీవితం పగ వారిక్కూడా వద్దు. ఆ పసి వాణ్ణి చూడాలని నా మనసు పీకు తోంది. ఎప్పుడైనా వెళ్తే ఓ గంట కూర్చోనిస్తారు. అంతే. ఆ తర్వాత వాణ్ణి దూరంగా తీసుకుపోతారు.-'' లత భుజం మీద తల ఆన్చి వెక్కి వెక్కి ఏడ్చాను.

'రమా! ఇంక నిన్ను క్షమించను. నీవిషయం కోర్టులో తేల్చుకుందాం పద-'' లత తీవ్రంగా అంది.

"కోర్టుకు దబ్బెక్కడిది లతా? చట్టాల వల్ల సంసారాలు బాగుపడతాయా? మనసులుండాలి గానీ-'' అంటూ కళ్లు తుడుచుకున్నాను.

ఆటో డ్రైవర్ కూడా నా వైపు జాలిగా చూస్తున్నట్ల నిపించి కుంచించుకు పోయాను. 'అదిగో - ఆ కనిపిస్తున్నదే అన్నయ్య ఇల్లు. దిగు.... వెళదాం పద' అంటూ పర్సు తీసి ఆటోకు ఎంతైందో నని మీటరు చూసి ఇవ్వ బోయాను. అతను "అమ్మా - మీ కథంతా నా కర్థమైంది. నా బాడుగ ఇవ్వఖ్కర్లేదు. దాన్నీ మీ డబ్బుకు చేర్చండి. మీరు మళ్లీ సుఖంగా మీ భర్త దగ్గరకు వెళ్లాలని నా కోరిక-'' అని తెలుగులో చెబుతూ ఆటో రిక్షా తీసుకుని వెళ్లి పోయాడు. మేం నిశ్చేష్టులమయ్యాం.

"సిగ్గులేదూ,చదు వుకున్న నీ మొగుడి కన్న ఈ ఆటో అతనే నయం.'' లత ఇలా తిట్టడం మొదలు పెట్టక ముందే ఇంట్లోకి పరుగు తీశాను. లత నా వెంటే వచ్చింది. మళ్లీ అన్నయ్యతో వాదించింది. దాని మాటలు ఎవరూ వినలేదు. విసుక్కుని వెళ్ళి పోయింది పాపం.

"ఎప్పుడైనా వస్తే రామ్మా లతా -'' అంటూ సాగనంపాడు అన్నయ్య.

కానీ మళ్లీ ఎప్పటికీ ఈ ఊరికి లత రాకూడదనీ, వచ్చినా, నా కంట పడగూడదనీ కో...కుంటున్నాను. ఎందుకంటే మా అత్తగారు కట్నం డబ్బు బాకీ తీర్చాననే సంతోషంతో, 'తిరిగి వెళ్లి ఉద్యోగం చేయి' అని ఆదేశించారు. బంగారు గుడ్లు పెట్టే బాతును వదలుకుంటారా?

ఇప్పుడు మళ్లీ ఇక్కడ ఉద్యోగం చేస్తూ అప్పుడప్పుడూ వూరికి వెళ్తూ వున్నాను. ఈసారి లత నన్ను కోపంతో దహించేస్తుంది. జీవితంతో రాజీ పడే నాలాంటి వాళ్లంటే లతకు అసహ్యం. మరి... మీకో....?



### బహుముఖ ప్రజ్ఞాశాలి
### బి. జెస్సీ

బి. జెస్సీ క్రీడలు, యోగా, చదువు, నాట్యం, సంగీతం, నటన మొదలైన వివిధ రంగాలలో ప్రావీణ్యురాలు. తండ్రి శ్రీ ఆనందరావు గారి ప్రోత్సాహంతో క్రీడల పట్ల చిన్నతనంలోనే ఆసక్తిని పెంచుకున్న జెస్సీ పట్టణ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన వివిధ పోటీలలో పాల్గొని అనేక బహుమతులు గెలుచుకుంది. 1982లో గుంటూరు జిల్లా స్థాయిలో జరిగిన 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతి, 4×100 మీటర్ల రిలే పరుగు పందెంలో ప్రథమ బహుమతి కైవశం చేసుకుంది. 1985లో జలంధర్‌లో అంతర్ విశ్వ విద్యాలయ స్థాయిలో జరిగిన కబాడీ పోటీలలో పాల్గొన్నది. 1989లో కలకత్తాలో జరిగిన సెపెక్ టెక్రో జాతీయ పోటీలలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రథమ మహిళల టీమ్‌కు కెప్టెన్ హోదాలో వెళ్ళారు. 1989లో జమ్ములో జరిగిన హేండ్ బాల్ నేషనల్స్‌లో పాల్గొన్నారు. 1990లో లూథియానాలో జరిగిన హేండ్‌బాల్ పోటీలలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మహిళల టీమ్‌కు మేనేజరెస్‌గా పనిచేశారు. అనేక అంతర్ పాఠశాల, కళాశాల పోటీలలో పాల్గొని బహుమతులు అందుకున్నారు.

యోగాలో చక్కటి ప్రవేశం వున్న జెస్సీ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ యోగా అసోసియేషన్ వారు '92లో అంతర్ జిల్లా స్థాయిలో నిజామాబాద్‌లో నిర్వహించిన యోగా పోటీలలోను, '93లో హైదరాబాద్ నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలోను పాల్గొని ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు.

విద్యార్థినిగా అనేక సాంస్కృతిక పోటీలలో పాల్గొన్న జెస్సీ ఉత్తమ నటి, దర్శకురాలు, గాయని నర్తకిగా బహుమతులు అందుకున్నారు. నాటికలు రాసి నిర్వహించారు. మనస్తత్వ శాస్త్రంలో కళాశాల మొత్తం మీద అత్యధిక మార్కులు సాధించారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. అనేక రేడియో కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ఆశువుగా కవితలు, పాటలు రాసి రాగం కట్టి పాడగలరు, నృత్యం సమకూర్చగలరు. ఈమె నిర్వహించిన అనేక నృత్య ప్రదర్శనలకు బహుమతులు లభించాయి. బి.ఎ., ఎమ్.పి.ఇ.డి. చేసిన జెస్సీ ప్రస్తుతం హైదరాబాద్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టరెస్‌గా పనిచేస్తున్నారు.

- అరుణా మోహన